సాక్షి సంగారెడ్డి
మంగళవారం। 6। జూన్। 2023



ధాన్యం.. తరలింపులో జాప్యం
వరి కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించకుండా కేంద్రాల్లోనే ఉంచడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 8లో

రేపు జాబ్ మేళా
ఈనెల 7వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి వందన సోమవారం తెలిపారు. లక్ష్మీ మార్కెటింగ్ లో 4 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పదో తరగతి, ఇంటర్ పాసైన విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. 084552701010 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 18 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 14 మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

కవితలకు ఆహ్వానం

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 11వ తేదీన తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శరత్ సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించనున్న కవి సమ్మేళనంలో పాల్గొనుటకు జిల్లాలోని కవులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల కవులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రభుత్వం సాధించిన ప్రగతిపై కవితలు రాయాలన్నారు. కవితలు తెలుగు, హిందీ, ఉర్దూ భాషలలో ఉండవచ్చన్నారు. ఆ కవితలు ఏ పత్రికలో ప్రచురించబడలేదని, కాపీ చేసినవి కాదని, తమ స్వీయ కవితలని ధ్రువీకరణ ప్రతం జతచేయాలన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొనుటకు తమ కవితలను ఈనెల 8వ తేదీ లోపు 15 వరుసలకు మించకుండా కవితలు రాసి, వ్యక్తిగత వివరాలను తెలియజేస్తూ జిల్లా విద్యాధికారి కార్యాలయంలో సమర్పించి, పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఫోన్ నంబర్ 9963423691లో సంప్రదించాలన్నారు.

విద్యావలంటీర్లను నియమించాలి

తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నందున విద్యా వలంటీర్లను నియమించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో డీఈఓ వేంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దత్తాత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కారించాలని, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు అందజేయాలని డిమాండ్ చేశారు. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, విద్యావలంటీర్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. 2017 టీఆర్‌టీ ఉపాధ్యాయులకు సర్వీస్ క్రమబద్ధీకరణ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అడివప్ప, రాష్ట్ర సహాయ కోశాధికారి భాస్కర్ దేశ్, జిల్లా బాధ్యులు రాములు, సంగమేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి హామీ’పై నిర్లక్ష్యం వీడాలి



నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక, భారతీయ కేత్ మజ్దూర్ సంఘం నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ఉపాధి హామీ పథకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, భారతీయ కేత్ మజ్దూర్ సంఘ్ జిల్లా కార్యదర్శి తాజొద్దీన్ అన్నారు. ఉపాధి హామీ కూలీలకు వేసవి వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం సంగారెడ్డిలోని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నాయన్నారు. నూటికి 90 శాతం నిరుపేదలకు ఉపయోగపడే ఉపాధి హామీని వారికి దూరం చేయడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. అందులో భాగంగానే సకాలంలో డబ్బులు ఇవ్వడం లేదని, పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించడంలేదన్నారు. ఏడాదిలో రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ ఉంటే తప్ప కూలీలకు సరైన కూలీ రాదని, ప్రభుత్వాలు రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఏడాదిలో 200 రోజుల పనిదినాలతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకూలీ రూ.600లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఇన్‌వార్డ్‌లో వినతి పత్రం అందజేశారు.

ఎంసీహెచ్‌కు లక్ష్య సర్టిఫికెట్

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రి మాతా శిశు కేంద్రానికి లక్ష్య సర్టిఫికెట్ వచ్చినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్ సోమవారం తెలిపారు. కాన్పులు, మెరుగైన వైద్యం అందించినదుకుగా ఈ సర్టిఫికెట్ వచ్చిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటేందుకు స్థలం లేదు!

- సగానికి తగ్గిన హరితహారం లక్ష్యం
- గత ఏడాది 95 లక్షలు నాటినట్లు రికార్డు
- ఈసారి 40.76 లక్షలకు పరిమితం చేసిన అటవీశాఖ



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమంలో నాటే మొక్కల సంఖ్య భారీగా తగ్గించాలని అటవీశాఖ భావిస్తోంది. గత ఏడాది ఈ కార్యక్రమంలో నాటిన మొక్కల సంఖ్యలో ఈ సంవత్సరం సగానికి పరిమితం చేయాలని నిర్ణయించింది. గత ఏడాది 96.35 లక్షల మొక్కలు నాటినట్లు అటవీశాఖ రికార్డుల్లో పేర్కొంది. ఈ ఏడాది నాటే మొక్కల సంఖ్యను 40.76 లక్షలకు కుదించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత ఏడాది కూడా 55.18 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, లక్ష్యానికి మించి మొక్కలు నాటామని ఆశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా హరితహారం కార్యక్రమం ప్రారంభమైన 2015 నుంచి ఇప్పటి వరకు 8.77 కోట్ల మొక్కలు నాటినట్లు అటవీశాఖ తన రికార్డుల్లో పేర్కొంది.

స్థలం కొరత

- హరితహారం కార్యక్రమంలో ఏటా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటుతుండటంతో ఈ ఏడాది మొక్కలు నాటేందుకు స్థలమే లేదని అటవీశాఖ చెబుతోంది.
- ఈ కారణంగానే ఈ ఏడాది మొక్కలు నాటే లక్ష్యాన్ని లక్ష్యాన్ని తగ్గించామని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు 2023 కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. మొత్తం 14 శాఖలకు మొక్కలు నాటే లక్ష్యాలను నిర్దేశించారు. + అత్యధికంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు 25 లక్షల మొక్కలు నాటాలని టార్గెట్ పెట్టారు. అటవీశాఖ ద్వారా ఐదు లక్షలు, ఎక్సైజ్, హార్టికల్చర్, పరిశ్రమలు, ఎన్‌హెచ్‌ఏఐ (నేషనల్‌హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) శాఖలకు కనీసం లక్ష చొప్పున మొక్కలు నాటేలా లక్ష్యాన్ని నిర్దేశించారు.

నర్సరీల వారీగా అందుబాటులో ఉన్న మొక్కలు

శాఖ	నర్సరీల సంఖ్య	అందుబాటులోని మొక్కల సంఖ్య
అటవీశాఖ	04	6.00 లక్షలు
డీఆర్‌డీఏ (ఉపాధి హామీ)	647	61.73 లక్షలు
మున్సిపాలిటీలు	08	1.38 లక్షలు
మొత్తం	659	69.11 లక్షలు

అర్బన్‌లో ఆరు లక్షలు..

- ఈసారి అర్బన్ ప్రాంతాల్లో 6.40 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. సంగారెడ్డి మున్సిపాలిటీతో పాటు, అమీన్‌పూర్, తెల్లాపూర్, జహీరాబాద్ పట్టణాల్లో కూడా లక్ష చొప్పున మొక్కలు నాటనున్నారు.
- బొల్లారం, నారాయణఖేడ్, సదాశివపేటలో 50 వేల నుంచి 70 వేల చొప్పున మొక్కలు నాటాలని భావిస్తున్నారు. ఏటా వర్షాలు కురియగానే హరితహారం పథకంలో మొక్కలు నాటుతుంటారు. సాధారణంగా జూలై రెండో వారం తర్వాత భూమి అనువుగా మారిన తర్వాత మొక్కలను నాటుతుంటారు.

లక్ష్యాన్ని పెంచాలని కలెక్టర్ ఆదేశాలు

- ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటే లక్ష్యాన్ని పెంచాలని కలెక్టర్ డాక్టర్ ఏ.శరత్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు.
- గత ఏడాది కంటే ఏమాత్రం తగ్గకుండా మొక్కలు నాటాలని, ఈ మేరకు లక్ష్యాన్ని మార్చాలని అటవీశాఖను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఏడాది నాటే మొక్కల లక్ష్యాన్ని పెంచుతామని జిల్లా అటవీశాఖాధికారి శ్రీధర్ ‘సాక్షి’కి తెలిపారు.

అందుబాటులో 69.11లక్షల మొక్కలు..

జిల్లాలో మొక్కలు నాటేందుకు ప్రస్తుతం 69.11 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో గత ఏడాది నాటకుండా మిగిలి పోయిన మొక్కలు 17 లక్షల వరకు ఉంటాయని అటవీశాఖ పేర్కొంటోంది. అటవీశాఖ, ఉపాధిహామీ, మున్సిపాలిటీల్లోని నర్సరీల్లో ఈ మొక్కలు పెంచారు.

విద్యుత్ సంస్కరణలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): విద్యుత్ సంస్కరణలను ప్రజలల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం అందోల్‌లో నిర్వహించిన విద్యుత్ ప్రగతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే విద్యుత్ వినియోగదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా విద్యుత్‌ను వాడుకుంటున్నారన్నారు. సీఎం కేసీఆర్ విద్యుత్‌పైనే ఎక్కువ దృష్టిని కేంద్రీకరించారన్నారు. అనంతరం అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైతే చీకటి తెలంగాణ అవుతుందని, కరెంట్ తీగల మీద బట్టలను ఆరబెట్టుకోవాలని గతంలో సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారని, ప్రస్తుతం ఆయనే సీఎం కేసీఆర్‌ను ప్రశంసిస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఉచిత కరెంట్ సరఫరా లేదని, కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ పి.జైపాల్‌రెడ్డి, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎల్లయ్య, డీఈ శ్రీనివాస్, ఏడీఏ శ్రీనివాస్‌రావు, ఎంపీపీ బాలయ్య, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ పి.నారాయణ, ఏఈలు శ్రీనివాస్, దుర్గయ్య, వైస్‌ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, సంగారెడ్డి కరెంట్ ఎస్‌ఏఓ ప్రభు, మున్సిపల్ వైస్ చైర్మన్ డెవిడ్, స్పెషల్ ఆఫీసర్ గీత, ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ వెంకటేశం, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, పుల్‌కల్ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వరము చైర్మన్ వీరారెడ్డి, ఆర్టిజన్ నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగంలో గుణాత్మక మార్పులు: ఎమ్మెల్యే

- రాష్ట్రంలో 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్
- తలసరి విద్యుత్ వినియోగంలో దేశంలోనే టాప్
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తీవ్ర విద్యుత్ కొరత ఏర్పడుతుందంటూ రాష్ట్ర విభజన సమయంలో పలు పార్టీల నాయకులు చేసిన విమర్శలను తిప్పికొడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదేళ్ల పదవీకాలంలో తలసరి విద్యుత్ వినియోగంలో రాష్ట్రాన్ని దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిపారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పటాన్‌చెరులో తెలంగాణ విద్యుత్ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సీఎం ఆదేశాల మేరకు మూడు వారాలపాటు వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధిని ప్రజలకు సమావేశాలు, సభల ద్వారా వివరించడం జరుగుతుందన్నారు. ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామికవాడగా చెందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో గత పాలకుల నిర్లక్ష్యంతో తీవ్రమైన విద్యుత్ కోతల కారణంగా పారిశ్రామిక రంగం తీవ్ర ఇబ్బందులకు గురైందన్నారు. నేడు ప్రతి పరిశ్రమకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తుండటంతో కార్మికులు సైతం ఓటీలు చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. దీంతోపాటు జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ రమేష్ చంద్ర, ఏడి దుర్గాప్రసాద్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, డీఎస్పీ భీమ్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, ఆత్మ కమిటీ చైర్మన్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

10న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి

సంగారెడ్డి టౌన్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జూన్ 10న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి తెలిపారు. జిల్లా కోర్టులో న్యాయవాదులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని అడ్వకేట్ లకు సూచించారు. సమావేశంలో జడ్జి కృష్ణార్జున, జడ్జి లావణ్య, జడ్జి హనుమంతరావు, అదనపు జడ్జి సునీతా రవీందర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా

కలెక్టర్ డాక్టర్ శరత్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి మున్సిపాలిటీ: తెలంగాణ అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా విద్యుత్ ప్రగతి, విద్యుత్ విజయోత్సవ వేడుకలు సంగారెడ్డిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని చింతా ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం చింతా ప్రభాకర్, కలెక్టర్ శరత్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ద ఉత్సవాల సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ తాను జేసీ విధులు నిర్వహిస్తున్నప్పుడు రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలంటే మెదక్ వెళ్లి సమావేశం నిర్వహించాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. విద్యుత్ కోతలతో ఎండిన పంటలతో రైతులు, తాగునీరు సరఫరాకాక ఖాళీ బిందెలతో రోడ్డుకు అడ్డంగా నిలబడి నిరసనలు తెలిపేవారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత రైతులకు 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ రమణ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత విద్యుత్ కొరత లేదన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, విద్యుత్ సూపరింటెండెంట్ మాధవరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

పాతచెరువు పరిశీలన

కంది(సంగారెడ్డి): మండల కేంద్రమైన కంది–చిమ్నాపూర్ మధ్యగల పాతచెరువును కలెక్టర్ డాక్టర్ శరత్ కుమార్ సోమవారం పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8వ తేదీన చెరువుల సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నారు. చెరువును పరిశీలించి సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



కంది పాత్తచెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ శరత్ కుమార్

ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ డాక్టర్ శరత్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: ఓటరు జాబితా సవరణను పొరపాట్లు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులతో ఓటరు జాబితాపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారందరూ తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 15 తేదీలోగా బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేసారు. ఓటరు జాబితా అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి, పరిష్కరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్‌ఓ నగేష్, ఆర్డీవోలు రవీందర్ రెడ్డి, అంబాదాస్, తహసీల్దార్‌లు, కలెక్టరేట్ ఏఓ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

టెన్నీస్ క్రీడాకారిణికి అభినందనలు



షన్వితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఇటీవల ఉగాండా దేశంలోని కంపాలలో అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య(ఐటీఎఫ్) జూనియర్ టోర్నీ జరిగింది. ఈ టోర్నీలో తెలంగాణ రాష్ట్రం నుంచి నూకల షణ్విత రెడ్డి పాల్గొని సింగిల్‌లో రన్నర్‌గా, డబుల్స్ విభాగంలో జర్మనీతో ఆడి టైటిల్ సాధించిన విషయం తెలిసిందే. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన నివాసంలో షన్విత రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను ప్రపంచ వేదికపై ఇనుమడింపచేయడం గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. క్రీడల్లో కూమార్తెను ప్రోత్సహిస్తున్న షన్విత రెడ్డి తండ్రి పటాన్‌చెరు సీఐ నూకల వేణుగోపాల్ రెడ్డిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

నేడు తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూన్ 6వ తేదీన మంగళవారం జిల్లాలో పారిశ్రామిక ప్రగతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ సోమవారం తెలిపారు. తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని పారిశ్రామిక వాడలు, ఐటీ కారిడార్లలో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఐటీ ఉద్యోగులు, మీసేవా కేంద్రాల నిర్వాహకులు, పరిశ్రమలలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు భాగస్వాములు కావాలన్నారు. టీహబ్, వీహబ్ లలో కూడా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సమావేశాలు నిర్వహిస్తారన్నారు. 2014 నుంచి 2023 వరకు జిల్లాలో పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడులు, ఉద్యోగ కల్పనకు వివరాలు తెలియజేస్తారని తెలిపారు.

పెయింటింగ్ పోటీల్లో విద్యార్థినికి ప్రథమ బహుమతి

జహీరాబాద్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో జహీరాబాద్ విద్యార్థిని ప్రథమ బహుమతి సాధించింది. మేలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి–జిల్లా జాతీయ హరిత దళం సహకారంతో ఆన్‌లైన్లో నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో జహీరాబాద్‌లోని సిద్దార్థ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న డి.అక్షిత ప్రథమ బహుమతిని సాధించింది. సోమవారం సంగారెడ్డిలోని డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు డీఈఓ వెంకటేశ్వర్లు బహుమతిని అందజేసి అభినందించారు. ద్వితీయ బహుమతిని సంగారెడ్డిలోని గ్లోబల్ పాఠశాలకు చెందిన ప్రణతి గెలుచుకుంది. తృతీయ బహుమతిని అల్గోల్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన ఎం.సంధ్యారాణి అందుకుంది. కార్యక్రమంలో పర్యావరణ అధికారి మాధవ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం బీడీఎల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈడీ ప్రధాన్, పీసీబీ అధికారి గీత విజేతలను సత్కరించి అభినందించారు.

పీఎఫ్‌ఎంఏపై వర్క్‌షాప్

పటాన్‌చెరు టౌన్: హైదరాబాద్ గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 21 తేదీలలో ‘ఫిజిక్స్ ఆఫ్ ఫ్లూయిడ్స్ అండ్ అప్లికేషన్స్’ (పీఎఫ్‌ఎంఏ)పై మూడు రోజుల వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని కార్యక్రమ నిర్వాహకులు ప్రొఫెసర్ కె.మారుతీప్రసాద్, డాక్టర్ మహతర్ రెజా లు సోమవారం తెలిపారు. ఫ్లూయిడ్ డైనమిక్స్‌లోని ప్రాథమిక మోడలింగ్ అంశాలు, కనిపించే నానీనియర్ డిఫరెన్షియల్ ఈక్వేషన్లను పరిష్కరించడానికి పెట్టర్బేషన్ మెథడ్స్, డిఫరెన్షియల్ ట్రాన్స్ఫర్మేషన్ మెథడ్ ఎఫ్ఏఎం, ఎఫ్పీఎం వంటి విశ్లేషణాత్మక, సంఖ్యా వర్క్‌లను పాల్గొనేవారికి పరిచయం చేయడం ఈ వర్క్‌షాప్ ప్రధాన లక్ష్యమన్నారు. ఇందులో పాల్గొనేవారి పరిశోధనా నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఉపకరిస్తుందన్నారు. అయితే పరిమిత సంఖ్యలోనే పాల్గొనడానికి అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్నవారు తమ వివరాలను ముందుగా తెలియజేయాలన్నారు. ఆసక్తి ఉన్న సమస్యపై ప్రెజెంటేషన్‌ను తీసుకురావడం, లేదా అప్పటికప్పు డు సమస్యను ఎంచుకొని ప్రదర్శనను సిద్ధం చేయగలిగి ఉండాలని వివరించారు. https://forms.gle/ wdr FnKe3fZvViTyH9 ద్వారా నేరుగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చ న్నారు. మరిన్న వివరాలకు డాక్టర్ విజయశేఖర్‌ను (9700668875) సంప్రదించాలని సూచించారు.

నూతన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రారంభం



ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావు తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం నూతన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సోమవారం మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మీ, మియాపూర్ ఏసీపీ నరసింహారావు, రామచంద్రాపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్, రామచంద్రపురం ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి, కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో 15 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన 13 మంది వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో జడ్జి ముందు హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించగా మరో ఇద్దరికి రూ.5 వేలు విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అడవిపంది దాడిలో మహిళా రైతుకు గాయాలు



సులోచనను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం గైరాన్ తండాకు చెందిన మహిళా రైతు సులోచన సోమవారం చేలో పనులు చేస్తుండగా అడవి పంది దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఖేడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట ఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, సింజీవరావు, సర్పంచ్ జైపాల్, అంజాగౌడ్ తదితరులు ఉన్నారు.

గొలుసు చోరీకి యత్నం



బాధితురాలు చిత్తారమ్మ

నర్సాపూర్: ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును తెంపేందుకు ఒకరు ప్రయత్నించిన ఘటన సోమవారం నర్సాపూర్‌లో జరిగింది. మండలంలోని రుస్తుంపేటకు చెందిన వృద్ధురాలు చిత్తారమ్మ సోమ వారం బస్టాండ్ నుంచి పట్టణంలోకి వెళుతుండగా, గుర్తు తెలియనివ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును తెంపి ఎత్తుకెళ్లేందుకు దుకు ప్రయత్నించాడు. ఈ సమయంలోనే వృద్ధురాలు గట్టిగా అరిచింది. రోడ్డుపై వెళుతున్న వారు, దుకాణదారులు అక్కడకు రావడంతో సదరు వ్యక్తి గొలుసు వదిలిపారిపోయాడు. ఈ సమయంలో చిత్తారమ్మ నేలపై పడిపోవడంతో ఆమె ముఖానికి చిన్నపాటి గాయమైంది. ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ శివకుమార్ చెప్పారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు జైలుశిక్ష

పాపన్నపేట(మెదక్): వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న కేసులో ఓ భర్తకు పదేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ మెదక్ కోర్టు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జితేందర్ సోమవారం తీర్పు ఇచ్చినట్టు పాపన్నపేట ఎస్‌ఐ విజయ్ తెలిపారు. మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన పెద్దారం క్రిష్ణ తన భార్య యశోదను వేధింపులకు గురిచేశాడు. అది తాళలేక ఆమె ఏడాది క్రితం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసు ఆధారాలు, వాదోపవాదాలు విన్న మీదట న్యాయమూర్తి శిక్ష విధించారు.

పాము కాటుతో రైతు మృతి



కనుకయ్య(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో ఓ రైతు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన అక్కన్నపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తాండ్ర వివేక్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గొట్టె కనుకయ్య(60) సోమవారం ఉదయం తన పొలంలో పని చేస్తుండగా పాము కాటువేసింది. కుటుంబ సభ్యులు హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు సదయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ధాన్యం.. తరలింపులో జాప్యం

- కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లు
- ఇప్పటి వరకు 1.13 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు
- రైతులకు చెల్లించినవి రూ.91.39 కోట్లు
- జిల్లాలో 211 కొనుగోలు కేంద్రాలు



రైస్ మిల్లు వద్ద ఉన్న లారీలు



వరి కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు

జోగిపేట(అందోల్): వరి కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించకుండా కేంద్రాల్లోనే పది నుంచి 15 రోజుల పాటు ఉంచడం వల్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలో క్వింటాల్‌కు 4 నుంచి 6 కిలోల చొప్పున తరుగుపేరిట తీసేస్తుండగా, ఆ ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపితే అక్కడ కూడా మరోసారి తేమ, తాలు పరీక్షలు జరిపి ఒక్కో సంచి నుంచి సుమారు 2 నుంచి 3 కిలోల తరుగు తీస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద హంగామా చేయడం తప్ప రైతులకప్పెలాంటి మేలు చేయడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. రోజుల తరబడి రైతులు కల్లాల వద్దే పడిగాపు కాస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఇప్పటి వరకు రూ.91.39 లక్షల రూపాయలను రైతుల ఖాతాల్లో వేయగా, ఇంకా రూ.68 కోట్లు చెల్లించాల్సి ఉంది.

జిల్లాలో 211 కేంద్రాలు

- ఈ సారి వరి పంట 1.83 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో 211 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పీఏసీఎస్, మెప్మా, మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశారు.
- జిల్లాలో 20,779 మంది రైతులుండగా, ఇప్పటి వరకు 1,01,600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.
- 5333 మంది రైతులకు ధాన్యం కొనుగోలు డబ్బులను రూ.91.39 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. ఇంకా రూ.68 కోట్ల బకాయి ఉన్నాయి.
- కొనుగోలు కేంద్రాలకు అనుగుణంగా 298 లారీలను ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 76 రైస్ మిల్లులు ఉండగా, వీటిలో 20 బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయి.
- వీటికి తరలించేందుకు నిర్ణయించగా, రోజుకు 10 నుంచి 12 వేల బస్తాలను మిల్లులు అన్‌లోడ్ చేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు.

రోడ్డెక్కుతున్న అన్నదాతలు

- కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు. పండించిన ధాన్యాన్ని రోడ్లపై వేసి తగలబెడుతూ నిరసనను తెలియజేస్తున్నారు.
- కేంద్రాల్లో తరుగు పేరిట దోపిడీ జరుగుతుండగా, రైస్ మిల్లులకు తీసుకెళ్లిన ధాన్యంలోనూ తరుగు తీస్తూ రైతులను మిల్లర్లు మోసం చేస్తున్నారు.
- కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంతో రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు.

పది రోజులపాటు ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో మరో పది రోజుల పాటు వరి ధాన్యం కొనుగోలు చేస్తాం. ఇప్పటి వరకు 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. ఇంకా రైతులకు రూ.68 కోట్లు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో మొత్తం 211 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇంకా 30 మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు రావాల్సి ఉంది. రైతులు ఆందోళన చెందొద్దు. ధాన్యాన్ని తప్పకుండా కొనుగోలు చేస్తాం.

– జమునా బాయి, జిల్లా సివిల్ సప్లయి అధికారి

ప్రభుత్వానికి, అధికారులు తీరుకు వ్యతిరేకంగా రోడ్లపైకి వచ్చి నినాదాలు చేస్తున్నారు.

చెల్లింపుల్లో జాప్యం:

- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే 24 గంటల్లోగా, లేదంటే 48 గంటల్లోగా మీ ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని ప్రభుత్వం గొప్పలు చెబుతుంది.
- కానీ ధాన్యం విక్రయించి పది రోజులు దాటినా ఇప్పటివరకు ధాన్యం డబ్బులు రాలేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటివరకు 1,01,600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. రైతులకు రూ.69 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒకటి, రెండ్రోజుల్లోగా బకాయి డబ్బులను వారి ఖాతాల్లో జమ చేస్తామని చెబుతున్నారు.

వేర్వేరు చోట్ల రైలు పట్టాలపై పడి ఇద్దరి ఆత్మహత్య

తూప్రాన్: బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్ రైల్వేస్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల రైలు పట్టాలపై పడి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు.

- బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో అదే గ్రామానికి చెందిన ఇప్పలపల్లి యాదగిరి(38) కొంతకాలంగా భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు, తల్లితో కలిసి హైదరాబాద్‌లో కూలిపనులు చేసుకుంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన యాదగిరి ఆదివారం గ్రామానికి ఒక్కడే వచ్చాడు. సోమవారం తెల్లవారు జామున పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు గుర్తించారు. మృత దేహం పట్టాల పక్కన పడి ఉంది. ఈ విషయంను పోలీసులకు తెలిపారు.
- శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన నీరుడి ప్రవీణ్ (22) జులాయిగా తిరుగుతున్నాడు. తల్లి మందలించడంతో రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నాడు. శరీరం రెండుభాగాలుగా నుజ్జునుజ్జు అయింది. ఈ విషయం తెలిసిన సీఐ శ్రీధర్, ఎస్‌ఐ సురేశ్‌కుమార్‌లు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన ప్రదేశాలను పరిశీలించారు. అయితే ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. కామారెడ్డి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం కోసం మృత దేహాలను కామారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే ఎస్‌ఐ తహూనాయక్ తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ సనత్ నగర్‌కు చెందిన కార్తీక్(34) మూడు నెలల క్రితం బతుకుతెరువు కోసం అమీన్‌పూర్ పరిధిలోని బంధం కొమ్ముకు వచ్చాడు. స్థానికంగా ఓ షోరూంలో ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 3వ తేదీన భార్య శ్రావణి తండ్రికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో చూసేందుకు సనత్ నగర్ కు వెళ్లింది. ఈ క్రమంలో 3 వ తేదీన భార్త కార్తీక్‌తో శ్రావణి ఫోన్‌లో మాట్లాడింది. తిరిగి అదే రోజు రాత్రి ఫోన్ చేస్తే కార్తీక్ స్పందించలేదు. మరుసటి రోజు కూడా ఫోన్ చేసిన భర్త స్పందించకపోవడంతో ఇంటికి వచ్చి చూడగా భర్త విగత జీవిగా కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్ చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను తప్పించబోయి.. కారు బోల్తా



కొడిపల్లి(నర్సాపూర్): ఎదురుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి ఓ కారు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన టీవీఎస్ మోపెడ్‌పై కొడిపల్లి వస్తున్నాడు. జాతీయ రహదారిపైకి ఒక్కసారిగా రావడంతో మెదక్ నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు మోపెడ్‌ను తప్పించబోయి సడన్ బ్రేక్ వేయడంతో కారు అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తా పడింది. కాగా కారులో ఉన్న వారితోపాటు బైక్‌పై ఉన్నవ్యక్తికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈవిషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాయమాటలు చెప్పి..

హుస్నాబాద్: నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలికి మాయమాటలు చెప్పి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన హుస్నాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి చెందిన కంకణాల సరోజన సోమవారం బస్టాండ్ నుంచి మల్లెచెట్టు చౌరస్తాలో ఉన్న పొట్లపల్లికి వెళ్లే ఆటో స్టాండ్‌కు నడుచుకుంటూ వెళుతోంది. ఈ క్రమంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి.. దొంగలు ఉన్నారని, బంగారాన్ని ఆభరణాలు చేతి సంచిలో పెట్టుకోవాలని సూచించాడు. అతని మాటలు నమ్మిన వృద్ధురాలు ఒంటిపై ఉన్న 6తులాల బంగారు ఆభరణాలను సంచిలో పెట్టుకునే ప్రయత్నం చేయగా, సదరు వ్యక్తి ఆభరణాలను తీసుకొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుకాణాదారులకు జరిమానా



జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

సిద్దిపేటజోన్: మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా చెత్తను బహిరంగంగా వేసిన పలువురికి మున్సిపల్ అధికారులు సోమవారం జరిమానా విధించారు. యూజీడీ డ్రైనేజీలో చెత్త వేసిన సాయి చరణ్ టిఫిన్ సెంటర్‌కు రూ.10వేలు, అదేవిధంగా సత్యం స్వీట్ హోం వారికి రూ.2వేలు, యూసుఫ్ చికెన్ సెంటర్ వారికి రూ.8వేలు జరిమానా విధించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత, యూజీడీ ఏఈలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న నలుగురి మృతి

వేర్వేరు ఘటనల్లో గాయపడిన నలుగురు పొందుతూ మృతి చెందారు.

బైక్‌పై నుంచి పడి...



విజయ్‌కుమార్

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం.. మండల పరిధిలోని బచ్చుగూడెం గ్రామానికి చెందిన విజయ్‌కుమార్(29) ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల మే 8వ తేదీన రాత్రి తన ద్విచక్ర వాహనంపై ఇంద్రేశం నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తుండగా మార్గమధ్యలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపానికి రాగానే పటన్‌చెరు నుంచి ఇంద్రేశం వైపు నుంచి వస్తున్న బైక్ విజయ్‌కుమార్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో విజయ్ కుమార్ తీవ్రంగా గాయపడటంతో గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం పటాన్‌చెరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎర్రగడ్డ ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ విజయ్ కుమార్ ఆదివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి...

చేగుంట(తూప్రాన్): చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. మాసాయిపేట మండలం పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన దేవొల్ల నర్సింలు(28) కూలి పనులు చేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో వాటిని అధిగమించడానికి మార్గం కనిపించక పోవడంతో ఆదివారం పురుగుల మందు సేవించి ఆత్మహత్య యత్నం చేశాడు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.

అదుపు తప్పి కింద పడి...



కల్యాడే రాజు (ఫైల్)

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోగల ఎస్‌ఎన్ ఫుడ్ కోర్టు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ పరిధిలోని సిద్దాపూర్ కాలనీలో నివాసం ఉంటున్న మృతుడు కల్యాడే రాజు శనివారం ఆటోలో సంగారెడ్డి నుంచి సదాశివపేటకు వస్తున్నాడు. అకస్మాత్తుగా టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి ముందు ఆగివున్న ఓ వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో రాజు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 వాహనంలో చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు.

కారు ఢీకొని..



శ్రీనివాస్‌రావు (ఫైల్)

నారాయణఖేడ్: మండలంలోని జూకల్ శివారు డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలో నిజాంపేట-నారాయణఖేడ్-బీదర్ 161బీ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం రెండు కార్లు ఢీకొన్న ఘటన తెలిసిందే. ఈ ఘటనలో ఓ కారు డ్రైవర్ కామారెడ్డి జిల్లా జుక్కల్‌కు చెందిన శ్రీనివాస్‌రావు (48) నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కారు యజమాని పడుకోలర్ సతీశ్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

తండ్రి మరణంతో అనాథలుగా ముగ్గురు పిల్లలు

జుక్కల్‌కు చెందిన సుర్నాకర్ శ్రీనివాస్‌రావుకు కొన్నేళ్ళ క్రితం ఉపాధి కోసం భార్యాపిల్లలతో హైదరాబాద్ వెళ్లాడు. కారుడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆరు నెలల క్రితం భార్య విద్యుదాఘాతంతో మృతి చెందింది. వీరికి కుమారుడు, ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు. భార్య మృతితో పిల్లలను తీసుకొని సొంత పట్టణమైన జుక్కల్‌కు వచ్చి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శ్రీనివాస్‌రావు మృతిచెందాడు.



అనాథలుగా మారిన ముగ్గురు పిల్లలు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సిద్దిపేటకమాన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎస్.శ్వేత సూచించారు. కమిషనరేట్ పరిధిలో సోమవారం జరిగిన సైబర్ నేరాల వివరాలు తెలిపారు.

- పట్టణంలోని ఓ మటన్ దుకాణ నిర్వాహకుడికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఆర్మీ అధికారినంటూ పరిచయం చేసుకున్నాడు. బల్క్‌లో మటన్ కావాలని అడ్వాన్స్‌గా డబ్బులు పంపిస్తానని, క్యూఆర్ కోడ్ పంపాడు. బాధితుడు స్కాన్ చేయగా మొదటగా రూ.5 వచ్చాయి. తర్వాత మళ్లీ స్కాన్ చేయగా బాధితుడి ఖాతా నుంచి రూ.11,450 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రకటన చూసి..

- పట్టణంలోని ఓ వ్యక్తి ఇన్‌స్టాగ్రాంలో ప్రకటనను చూసి అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేశాడు. ప్రకటనలో ఉన్న వాటిని లైక్ చేస్తే బహుమతి, డబ్బులు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి తెలపడంతో వివరాలు నమోదు చేశాడు. రిజిస్ట్రేషన్ నిమిత్తం రూ.2,500 పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పార్ట్‌టైం జాబ్ పేరిట..

- భూంపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి పార్ట్ టైం జాబ్ ఉందంటూ మెసేజ్ వచ్చింది. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి నమ్మించడంతో బాధితుడు రూ.17,800 పెట్టుబడిగా పెట్టాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫైనాన్స్ పేరుతో..

- దుబ్బాక పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో బాలాజీ ఫైనాన్స్ పేరుతో ఉన్న యాడ్‌ను క్లిక్ చేసి, వివరాలు నమోదు చేశాడు. తర్వాత గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి రూ.5లక్షలు లోన్ మంజూరైందని ప్రాసెసింగ్ చార్జీల నిమిత్తం డబ్బులు పంపించాలని సూచించాడు. దీంతో బాధితుడు ఆన్‌లైన్‌లో రూ.20వేలు పంపించి మోసపోయాడు.

లోన్ మంజూరైందని..

- గజ్వేల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి లోన్ మంజూరైందని గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. ప్రాసెసింగ్ ఫీజ్ కింద రూ.19,850 చెల్లించాలని చెప్పడంతో బాధితుడు డబ్బులు పంపించాడు. సదరు నంబర్‌కు ఫోన్ చేయగా స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.
- మర్కూక్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి.. లోన్ తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించకపోతే ఫొటోలు, మీ కుటుంబ సభ్యుల ఫొటోలు ఎడిట్ చేసి మీ కాంటాక్ట్స్ లిస్టులో ఉన్న నంబర్లకు పంపిస్తానంటూ బెదిరించాడు. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



తహీర్‌పాషా మృతదేహం

తూప్రాన్: రోడ్డు ప్రమాదంలో ఓ తండ్రి చనిపోగా, కుమారుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పట్టణ సమీపంలో రావెల్లిసమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. ఎస్‌ఐ సురేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..దుబ్బాక మండలం లచ్చాపేటకు చెందిన తహీర్‌పాషా(50) కుటుంబసభ్యులతో రామాయంపేట మండలం జప్తిశివనూర్‌లో ఓ శుభకార్యానికి ఆదివారం వచ్చాడు. తహీర్‌పాషా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. సోమవారం కుమారుడితో కలిసి నగరానికి బయలుదేరాడు. రావెల్లి సమీపంలోకి రాగనే స్కూటీ అదుపు తప్పి రహదారి కిందకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తహీర్‌పాషా అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. కుమారుడు తయ్యబ్‌పాషాకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు తయ్యబ్‌పాషా కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తహీర్‌పాషా మృత దేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెల మృతి



నర్సాపూర్: చనిపోయిన గొర్రెలను చూపిస్తున్న మల్లేశ్‌యాదవ్

నర్సాపూర్: షెడ్డులో ఉన్న గొర్రెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయని రైతు మల్లేశ్‌యాదవ్ చెప్పారు. పట్టణంలోని జగన్నాథరావు కాలనీకి వెళ్లే దారిలో షెడ్డులో రాత్రిపూట తాను గొర్రెలను ఉంచుతానన్నారు. ఆదివారం రోజు మాదిరిగానే గొర్రెలను షెడ్డులో వేసి, తాళం వేశామన్నారు. కాగా ఉదయం వెళ్లి చూసే సరికి 32 పెద్ద గొర్రెలు, రెండు పిల్లలు మృత్యువాత పడ్డాయన్నారు. రెండు రోజుల క్రితం వ్యాపారులు వచ్చి గొర్రెలను మూడు లక్షల రూపాయలకు అమ్మాలని అడిగితే అమ్మ లేదని చెప్పారు. గొర్రెలు చనిపోవడంతో మూడు లక్షల రూపాయలు నష్టం జరిగిందన్నారు.

పాడి గేదె..

నర్సాపూర్ రూరల్: మండల పరిధిలోని లక్ష్మణ్ తండాకు చెందిన రైతు మెగావత్ బాబునాయక్ రోజులాగే తన పాడి గేదెలను తండా సమీపంలోని పొలాలకు మేత కోసం తీసుకెళ్లగా పంట పొలాల మీదుగా ఉన్న విద్యుత్ లైన్ స్తంభం నుంచి ఎర్తింగ్ రావడంతో ఓ పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ఆ గేదె విలువ రూ. 50 వేలు ఉంటుందన్నారు.

ఎద్దు....

కంది(సంగారెడ్డి): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. ఈ సంఘటన కంది మండలంలోని జుల్‌కల్‌లో జరిగింది. సోమవారం గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైతు చంద్రయ్య పొలం నుంచి మేత తెచ్చేందుకు ఎడ్లబండిపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఈదురుగాలకు తెగిపడిన విద్యుత్ తీగలు ఓ ఎద్దును తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి తనకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి చేశాడు.

అటవీ సిబ్బందిపై దాడి చేసిన వారిపై కేసు

శివ్వంపేట (నర్సాపూర్): అటవీ సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ విఠల్ తెలిపారు. మండల పరిధి హరిదాస్ తండాలో ఆదివారం రాత్రి పలువురు గిరిజనులు ట్రాక్టర్ల ద్వారా అటవీ భూమిని చదును చేస్తున్న విషయం తెలుసుకున్న సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లగా తండావాసులు రాళ్లు, కట్టెలతో దాడికి పాల్పడ్డారు. ఫారెస్టు సెక్షన్ అధికారి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు తండాకు చెందిన పలువురిపై కేసు నమోదు చేశారు.

చండిలో...

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ విఠల్ తెలిపారు. శివ్వంపేట మండల పరిధిలోని చండి గ్రామానికి చెందిన సాయిరెడ్డి వ్యవసాయ పొలంలోని హద్దురాళ్లను తొలగించి దాడికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ వినియోగం.. ప్రమాదకరం



ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఎఫ్‌డీ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ప్లాస్టిక్ వినియోగం.. ప్రమాదకరమని ఎస్‌ఎఫ్‌డీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని బీసీ వసతి గృహంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 1973లో జూన్ 5వ తేదీని ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఎస్‌ఎఫ్‌డీ ప్రస్తుత సంవత్సరాన్ని «ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారం» అనే నినాదంతో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించాలని నిర్ణయించిందన్నారు. ఎస్‌ఎఫ్‌డీ జాతీయశాఖ వారం రోజుల పాటు పర్యావరణాన్ని రక్షించాలని ర్యాలీలు, సెమినార్, ఏకో బ్రిక్స్ అవగాహన, ప్లాస్టిక్ వినియోగం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగం తీవ్ర స్థాయిలో ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వినియోగంపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాగనాథ్, ఎంగొండ, బసవేశ్వర్, వెంకట్, శంశాంక్ పాల్గొన్నారు.